## క్లుప్తంగా

### ఒకే కాన్పులో రెండు లేగదూడలు


ఇరువాడలో జన్మించిన జోడు లేగదూడ పెయ్యిలు

సబ్బవరం: మండలంలోని ఇరువాడ గ్రామంలో మామిడి బంగారు నాయుడు అనే రైతుకు చెందిన ఆవు రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. గ్రామంలో బంగారు నాయుడు మినీ డెయిరీ నిర్వహిస్తున్నాడు. తన ఫారంలో 15 వరకూ ఆవులు ఉన్నాయి. వీటిలో హెచ్ఎఫ్ క్రాస్ బ్రీడుకు చెందిన ఆవుకు మంగళవారం అర్ధరాత్రి సమయంలో జోడు పెయ్యిలు పుట్టాయి. లేగదూడలు రెండూ ఆరోగ్యంగా ఎంతో ఉత్సాహంతో గెంతులు వేయడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

### 'బీజేపీ వచ్చాకే ప్రభుత్వరంగ సంస్థలు నాశనం'

అగనంపూడి: బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో దాదాపు అన్ని ప్రభుత్వరంగ సంస్థలు సర్వనాశనం అయ్యాయని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకుడు వి.శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1189వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాకముందు బ్యాంకులు డిపాజిట్ల కోసం విశాఖ ఉక్కు ముందు మోకరిల్లేవని, కాని నేడు ఆయా సంస్థలు ఛిన్నంగా వ్యవహరిస్తున్నాయంటే దానికి కారణం కేవలం బీజేపీ ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. దేశానికి వెన్నుదన్నుగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో పాటు పలు ప్రభుత్వ రంగ సంస్థలు నేడు దయనీయ స్థితికి వెళ్లాయంటే కారణం కేవలం కేంద్ర ప్రభుత్వ తీరే అన్నారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రప్రభుత్వం పునరాలోచించాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా సుత్తమ్మ తల్లి దేవర ఉత్సవం


చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లి

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ, మూలకుద్దు పంచాయతీల గ్రామదేవత సుత్తమ్మతల్లికి మంగళవారం రాత్రి ఘనంగా దేవర ఉత్సవం నిర్వహించి బుధవారం అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చారు. బాణసంచా, నేలవేషాలు, సాముగరిడీ, కోలాటం, డీజే, తీన్‌మార్ తదితర హంగామాలతో ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. సోమవారం పోలమాంబ అమ్మవారి దేవర, మంగళవారం అనుపోత్సవం జరిగిన సంగతి తెలిసిందే. కాగా ఈ నెల 27, 28, 29న సుత్తమ్మతల్లి తొలేళ్ల రథోత్సవం, పాలధార, అనుపోత్సవం నిర్వహించనున్నారు. 14 గ్రామాల ప్రజలు జరుపుకునే ఈ అమ్మవారి ఉత్సవాలు తిలకించడానికి రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది భక్తులు తరలిరానున్నారు.

### కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలకు వినతి

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో మత్తు వ్యవస్థ విముక్తి విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల 9 నెలల బకాయి జీతాలు తక్షణమే విడుదల చేయాలంటూ వైద్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు ఉద్యోగులు బుధవారం వినతిపత్రం అందించారు. కాంట్రాక్టర్ అగస్టు 2023 నుంచి గౌరవవేతనాలు చెల్లించట్లేదని, ఈ విషయాన్ని పలుమార్లు ప్రభుత్వ దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎల్.శ్రీను, రాజ్యలక్ష్మి, క్రాంతికుమార్, చంద్రశేఖర్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు కామేశ్వరమ్మ పండగ

మాకవరపాలెం: మండలంలోని రాచపల్లి జంక్షన్‌లో కామేశ్వరమ్మతల్లి పండగను గురువారం నిర్వహించనున్నారు. పండగ సందర్భంగా భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా అమ్మ వారి పండగను స్థానికులు ఘనంగా నిర్వహిస్తారు. ఎన్నికల ఏడాది కావడంతో ఈ సారి పండగకు భారీ ఏర్పాట్లు చేశారు.



# పెందుర్తిలో బిగ్ ఫైట్

- కూడికలు.. తీసివేతల్లో నాయకులు
- విజయంపై అభ్యర్థుల్లో ఉత్కంఠ
- మెజారిటీపై సన్నగిల్లిన ఆశలు



అదీప్‌రాజ్ (వైఎస్సార్‌సీపీ)  పంచకర్ల (జనసేన)

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలో గెలుపుపై ప్రధాన పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికలకు ముందు తమకు వచ్చే మెజార్టీపై లెక్కలు చెప్పిన అభ్యర్థులు ఇప్పుడు గెలిస్తే చాలనుకొనే పరిస్థితి కనిపిస్తోంది. రెండు ప్రధాన పార్టీల మధ్య ఓటింగ్ నువ్వా, నేనా అనే విధంగా పోలవడంతో ఎవరు గెలుస్తారనే విషయాన్ని నిర్దిష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో 3,07,545 మంది ఓటర్లకు గాను 2,28,740 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 1,52,592 మందికి గాను 1,11,970 మంది, స్త్రీలు 1,54, 948 మందికి 1,16,766 మంది ఓటు వేశారు. పలు కారణాలతో 78,805(పురుషులు/స్త్రీలు) మంది ఓటుకు దూరంగా ఉన్నారు. మగువలు ముందంజలో ఉన్నారు. గత ఎన్నికలతో పోల్చితే ఈ సారి 15,878 మంది స్త్రీలు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**14 మంది బరిలో ఉన్నా..**

నియోజకవర్గంలో 14 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధాన పోటీ వైఎస్సార్‌సీపీ, జనసేన మధ్యే కొనసాగినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాజిటివ్ ఓటింగ్ తనకే ఉంటుందని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటింగ్ తర్వాత కార్యకర్తలు, పరిశీలకులు ఇచ్చిన నివేదికల ఆధారంగా తమకే అనుకూలంగా ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యం కల్పించారు. దీంతోపాటు అన్ని వర్గాల్లో జగన్‌మోహన్‌రెడ్డికి అభిమానులున్నారు. ఆ ఓట్లు తమకే వస్తాయని భావిస్తున్నారు.

**పొత్తు కలిసి వస్తుందని జనసేన**

ఇదిలా ఉండగా, పొత్తు, ఓటింగ్ సరళి తనకే కలిసొచ్చే విధంగా ఉందని జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు పేర్కొంటున్నారు. పోలింగ్ సరళిపై ఆయన కూడా తమ శ్రేణులతో మాట్లాడి ఒక నిర్ధారణకు వచ్చారు. బీజేపీ, టీడీపీ పొత్తుతో ఓటింగ్ తనకు అనుకూలంగా పడిందని పేర్కొంటున్నారు. యువత ఓటింగ్ పూర్తిస్థాయిలో తమకే పోలైందన్న నమ్మకంతో ఉన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్‌తోపాటు ఇతర పథకాల వల్ల కూడా తమకు మెజార్టీ తెచ్చి పెడుతుందని పంచకర్ల భావిస్తున్నారు. తాము వెయ్యి ఓట్లకు పైగానే తెచ్చుకుంటామని స్వతంత్ర అభ్యర్థులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం మెజార్టీపై ఆశలు వదులుకున్నారు. ఓటర్లు మాత్రం ఈ పరిస్థితిని ఆసక్తిగా గమనిస్తున్నారు.

## బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె

- నేడు ఉత్సవాలకు అంకురార్పణ
- ముస్తాబైన పెందుర్తి వెంకటాద్రి





పెందుర్తి: బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు పెందుర్తి వెంకటాద్రి సిద్ధమైంది. శ్రీనివాసుడు పద్మావతి అమ్మవారిని వివాహమాడేందుకు భూమి మీద అడుగిడిన పవిత్ర రోజు వైశాఖ శుద్ధ దశమి నాడు ఏటా బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. పెందుర్తి వెంకటాద్రి నిర్మాణానికి కూడా వైశాఖ శుద్ధ దశమి నాడే తొలి అడుగు పడింది. ఈ క్రమంలో ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించి వెంకటాద్రిపై వైశాఖ శుద్ధ దశమి(శనివారం) నాడు కల్యాణం చేస్తారు. ఈ క్రమంలో వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు విష్వక్సేనపూజ, అంకురార్పణ జరుగుతుంది. రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడోరోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీసులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. భక్తులంతా తరలిరావాలని కోరారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వెంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## 22, 23 తేదీల్లో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఈ నెల 22, 23వ తేదీల్లో విశాఖపట్నం వేదికగా నిర్వహించనున్నారు. ఈ మేరకు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో కలిసి నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ కార్యదర్శి డాక్టర్ బి.బాలాజీ ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో వేడుకలను నిర్వహిస్తామన్నారు. ఈ నెల 22న బీచ్ రోడ్డులో ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సదస్సు, ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని తెలిపారు. 23న కూడా ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, 23న జాతీయ సదస్సును ఏయూ వృక్షశాస్త్ర విభాగంలో జరుగుతుందన్నారు. ప్రతి వ్యక్తి జీవితంతో జీవ వైవిధ్యత ముడిపడి ఉందన్నారు. ప్రతీ వ్యక్తిని భాగస్వాములను చేస్తూ జీవవైవిధ్య పరిరక్షణ దిశగా పనిచేస్తామన్నారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ బి.వి.ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణ దిశగా చేసే కార్యక్రమాలకు తాము సహకారం అందిస్తామన్నారు. సంరక్షణ, పరిశోధన, అధ్యయన రంగాలకు ఉపయుక్తంగా వర్సిటీలో జీవవైవిధ్యతను పరిరక్షించాలని సూచించారు.

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ బయో డైవర్సిటీ పార్క్‌ను ఏయూలో ఏర్పాటు చేస్తామన్నారు. దీని కోసం ప్రత్యేకంగా స్థలాన్ని సైతం గుర్తించామన్నారు. ఏయూ వేదికగా వెయ్యి స్టార్టప్ సంస్థలు పనిచేయడం లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. ఏయూ టెక్ హబ్‌లో ఇప్పటికే 172 సంస్థలు పని చేస్తున్నాయన్నారు. విదేశీ విద్యార్థుల సంఖ్య వెయ్యి మార్క్‌ను దాటిందన్నారు. ఏయూ నలుమూలలా ఏర్పాటు చేసిన స్టార్టప్ కేంద్రాలు టెక్, ఫార్మా, ఫుడ్ సైన్స్, ఆక్వా రంగాలకు అవసరమైన సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, వృక్షశాస్త్ర విభాగాధిపతి ఆచార్య సంధ్య దీపిక, ఆచార్య ఎస్.బి.పడాల్, రత్నకుమార్, బలరాం పడాల్, డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### 19న కుంతీ మాధవ స్వామి చందనోత్సవం


కుంతీ మాధవ స్వామి విగ్రహం

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో స్వామి చందనోత్సవం ఈ నెల 19న నిర్వహించనున్నట్టు ఈవో నానాజీ బాబు తెలిపారు. 18న రాత్రి పది గంటలకు కుంతీ మాధవ స్వామి విగ్రహాన్ని చందనంతో అలంకరిస్తారు. 19న ఉదయం ఆరు గంటల నుంచి చందనం అలంకరణలో ఉన్న కుంతీ మాధవ స్వామిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రవేశం కల్పిస్తారు.

### ఘనంగా ఆశ్రమ వార్షికోత్సవం


పూజలు అందుకున్న సాయినాథుడు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు పరిధి రామయోగి అగ్రహారంలో గల శ్రీ సద్గురు సేవాశ్రమం 14వ వార్షికోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. 5 రోజులపాటు నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా తొలి రోజు ఆశ్రమ ప్రాంగణంలో గల శ్రీ శిర్డీ సాయి నాథునికి వేకువజామున కాకడ హారతి నిర్వహించి, 108 కలశములతో జలాధివాసము, అఖండ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సుదర్శన హోమం నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## కోదండ రాముడి పుష్పయాగానికి పూలు తరలింపు


పుష్పయాగానికి తరలించే పూలను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: తిరుపతి శ్రీకోదండ రాముడి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలి వెళ్లాయి. ఆధ్యాత్మిక వేత్త హిమాంశు ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలలోని వివిధ ప్రాంతాలలో సేకరించిన పూలును బుధవారం ఎంవీపీలోని టీటీడీ ఈ-దర్శనం కౌంటర్ వద్ద భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. తిరుమలలో ఉత్సవాల్లో భాగంగా జరిగే పుష్పయాగానికి ఈ పూలు తరలిస్తున్నట్లు హిమాంశు ప్రసాద్ తెలిపారు. కలువలు, తామరలు, తులసి, మల్లి ఇలా వివిధ రకాలకు చెందిన 15 వేల పూలను సేకరించామన్నారు. ఈ పూలకు సంకల్పం చేసి అనంతరం బుధవారం సాయంత్రం తిరుమల తరలించామన్నారు. ఈ కార్యక్రమంలోమ పలువురు ఎంవీపీ వాసులు, వెంకటేశ్వస్వామి భక్తులు పాల్గొన్నారు.

## మేహాద్రి కాలువలోకి దూసుకుపోయిన ఆటో


గాయపడిన ఆటో డ్రైవర్‌ను బయటకు తీసుకువస్తున్న స్థానికులు

- ముగ్గురికి గాయాలు


గెడ్డలోకి దూసుపోయిన ఆటో

పెందుర్తి: పెందుర్తి–సబ్బవరం రోడ్డు పెందుర్తి రైల్ ఓవర్ వంతెనపై నుంచి సమీపంలోని మేహాద్రి గెడ్డ ప్రధాన కాలువలోకి ఓ ఆటో అదుపుతప్పి దూసుకుపోయింది. ఆటో డ్రైవర్ సహా ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. పెందుర్తి నుంచి సబ్బవరం వైపు వెళ్తున్న ఆటో వంతెనపై ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో అదుపు తప్పి గెడ్డలోకి దూసుకుపోయింది. దీంతో ఆటో డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వెంటనే స్పందించిన స్థానికులు హుటాహుటిన వారిని ఆస్పత్రికి తరలించారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చికిత్స పొందుతూ ఒకరు మృతి

పీఎం పాలెం : ప్రమాదానికి గురైన భవన నిర్మాణ కార్మికుడు చికిత్స పొందుతూ మరణించాడు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధురవాడ శ్రీనివాసనగర్‌లో కుటుంబంతో నివసిస్తున్న నందిగ చిన్న (27) భవన నిర్మాణ కార్మికుడు. ఈ నెల 4న జీవీఎంసీ 5వ వార్డులోని శివశక్తినగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో రాడ్ బెండింగ్ పనులకు వెళ్లాడు. అక్కడ పని చేస్తుండగా రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ కిందకు పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుని భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## కల్యాణ వైభోగం


పాల్గొన్న ఉభయదాతలు


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

## కాలువలు శుభ్రం చేయాలని వినతి


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న యూత్ సభ్యులు

పరవాడ: వెన్నలపాలెం గ్రామంలోని హనుమాన్‌నగర్‌లో కాలువలు అధ్వానంగా ఉన్నాయని.. చెత్త కుప్పలు తొలగించాలని యూత్ సభ్యులు పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో వాటర్ ట్యాంకును ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదని, కాలువలు చెత్త చెదారాలతో నిండి మురుగునీరు పారడం లేదని కార్యదర్శి వరలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీలో ఏర్పాటు చేసిన వీధి లైట్లు మరమ్మతులతో మూలుగుతున్నాయని ఫలితంగా రాత్రి సమయంలో కాలనీ వాసులు అంధకారంలో అలమటించాల్సి వస్తుందని వివరించారు. వెంటనే వీధి లైట్లకు ఏర్పాటు చేయాలని కోరారు. కాలువలు, వాటర్ ట్యాంకు, ఇతర సమస్యలను రెండు రోజుల్లోగా పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి యూత్ సభ్యులకు హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో యూత్ సభ్యులు సుధీర్, రవితేజ, గిరి, శ్రీను, హరి, హేమంత్, పవన్‌సాయి, కృష్ణ, అప్పు, మోహన్ దుర్గా, త్రినాథ్ ఉన్నారు.

## కంప్యూటర్ ల్యాబ్ ఆధునికీకరణకు భూమిపూజ


ల్యాబ్ ఆధునికీకరణ పనులకు భూమి పూజ చేస్తున్న కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో కంప్యూటర్ ల్యాబ్ ఆధునికీకరణ పనులకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అధికారులు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.34లక్షలతో ఈ ఆధునికీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పనులు పూర్తి చేసిన వెంటనే 25 కంప్యూటర్లు, టేబుల్స్, కుర్చీలను అందజేయనున్నామని వివరించారు. విద్యార్థులకు ఆధునిక సదుపాయాలతో కూడిన ల్యాబ్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం


విద్యార్థినికి అడ్మిషన్ పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్

అగనంపూడి: అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియను కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్ బాబు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఎంపీసీలో 88 సీట్లు, ఆర్ట్స్‌లో ఒక్కో గ్రూపులో 40 సీట్ల వంతున ఉన్నాయన్నారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో కూడా సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు బైపీసీ గ్రూపుపై ఆసక్తి కనబరచడంతో ఈ ఏడాది నుంచి ఆ గ్రూపు ఏర్పాటుకు అధికారులను అనుమతి కోరామన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే బైపీసీ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, ఎం.మస్తాన్ రెడ్డి, లెక్చరర్లు డి.దివ్య, రత్నం, సూర్య శంకరరావు పాల్గొన్నారు.

## నిరంతర అన్నదాన సేవలకు రెండేళ్లు

- ధ్యాన మందిరంలో కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌ల ద్వారా ఆహారం పంపిణీ


కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లో భద్రపరచిన ఆహారాన్ని అన్నార్తులకు అందిస్తున్న నూకల శేషగిరిరావు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో నిరంతర అన్నదానం కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు రెండేళ్లు పూర్తయ్యాయి. ధ్యాన మందిరంలో కొన్నేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి మరింత ప్రోత్సాహమిచ్చేలా ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ సహకారంతో 2022 మే 16న రెండు కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం జరుగుతున్న అన్నదానంలో పాల్గొంటున్న వారికి అదనంగా 24 గంటలు ఏ సమయంలోనైనా ఆకలితో ఉన్నవారు ఈ ఫ్రిడ్జ్‌ల్లో నుంచి ఆహారం తీసుకోవచ్చు. ప్రతి రోజు వీటిలో ఆహారాన్ని ప్యాకెట్ల రూపంలో భద్రపరుస్తున్నారు. రెండేళ్లుగా ప్రతి రోజు కనీసం 50 నుంచి 100 మంది ఆకలిని తీర్చగలిగినందుకు తమకెంతో సంతోషంగా ఉందని ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు తెలిపారు.

## వీరభద్ర విజయం.. విశిష్ట కావ్యం


మాట్లాడుతున్న ఆచార్య అయ్యగారి సీతారత్నం

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం 'పోతన వీరభద్ర విజయం' అనే అంశంపై ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ అయ్యగారి సీతారత్నం ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోతన వీరభద్ర విజయం భాగవతానికి ముందే రాశారని ఆరుద్ర నిరూపించారన్నారు. పోతన ఈశ్వర భక్తి ఈ కావ్యంగా స్పష్టమవుతుందని, అనంతర కాలంలో భాగవతం రాసేటప్పటికీ ఏకేశవరో పాసన హరిహర అభేదం తెలుస్తుందన్నారు. వీరభద్ర విజయంలోని పద్యాలను పరిశీలిస్తే పోతన శైలి, శబ్దాలంకార ప్రీతి సుస్పష్టమవుతుందన్నారు. లాటానుప్రాసం, వృత్యానుప్రాసం అద్భుతంగా ప్రయోగించారని చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వీరభద్ర విజయం మంచి కవిత్వ పటుత్వంతో రాసిన కావ్యమని తెలిపారు. దీని మూలం వాయు పురాణంలోనిదన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ పోతన రాసిన వీరభద్ర విజయం శైవమత ప్రధాన మైనదని, శివుడి జటాజూటం నుంచి ఉద్భవించిన వీరభద్రుడు, దక్షుని సంహరించుట ప్రధాన ఇతివృత్తమని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.జి.వేణు, ఎస్.విజయ్‌కుమార్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలి


ప్రసంగిస్తున్న సుందర్ గోపాల్ ప్రభు

కొమ్మాది : నేటి తరం యువత ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలని సుందర్ గోపాల్ ప్రభు సూచించారు. భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో రెండో రోజు నిర్వహించిన ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్ (ఐఐవైసీ) సమావేశంలో బుధవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి సనాతన ధర్మాన్ని బోధించే కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆధ్యాత్మిక భావాలు మనిషిని కష్ట సుఖాల్లో నిలబెడతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఇస్కాన్ ఆలయంలో గల శ్రీ రాధాకృష్ణులకు, జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాగవత ప్రవచనాలు ఉదయం 4.30 గంటల నుంచి ప్రత్యేక హారతి కార్యక్రమాలు, నగర సంకీర్తన నిర్వహించారు. సమావేశాల్లో స్వామీజీ పరివ్రాజిక స్వామి మహారాజ్, రాధే శ్యామ్ ప్రభు, సాగర్‌నగర్ ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని తదితరులు పాల్గొన్నారు.